www.kalamdaily.com
Follow on: Kalamtelugu
కలం
ప్రజల గళం...
21-02-2026, శనివారం పేజీలు: 2

360° SINGLE TOPIC

తెలంగాణ.. పార్టీలు



## తెలంగాణ ప్రజా సమితి



మర్రి చెన్నారెడ్డి

**తెలంగాణ** తొలి దశ ఉద్యమంలో పుట్టిన పార్టీ తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్). ఇది స్వరాష్ట్ర ఉద్యమానికి రాజకీయ రూపాన్ని ఇచ్చింది. అప్పటి వరకు తెలంగాణ కోసం పోరాడుతున్న తెలంగాణ పీపుల్స్ కన్వెన్షన్‌నే 1969 మార్చి 25న టీపీఎస్‌గా మార్చారు. దీన్ని కాంగ్రెస్ నుంచి బయటకొచ్చిన అనంతుల మదన్ మోహన్, మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి నేతలు ముందుండి నడిపించారు. దాదాపు ఏడాదిన్నర పాటు ఉనికిలో ఉన్న ఈ పార్టీ.. ఆనాడు తెలంగాణ కోసం ఉధృతంగా ఉద్యమించింది.

- అనంతుల మదన్ మోహన్ 1969 మార్చి 25 నుంచి ఏప్రిల్ 6 వరకు టీపీఎస్ అధ్యక్షుడిగా పని చేశారు.
- 1969 ఏప్రిల్ 6 నుంచి 1971 సెప్టెంబర్ వరకు మర్రి చెన్నారెడ్డి అధ్యక్షుడిగా ఉన్నారు.
- 1971 మార్చిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలోని 14 సీట్లలో 10 సీట్లను టీపీఎస్ గెలుచుకుంది. ఇది ఉద్యమానికి మరింత ఊపునిచ్చింది.
- కానీ, మర్రి చెన్నారెడ్డి 1971 సెప్టెంబర్‌లో టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

# మన పార్టీల్లో మాయమైన తెలంగాణం



- పార్టీ పేరులో 'తెలంగాణ' ఓటు బ్యాంకు కోసమేనా?
- ఆ పదం తీసేసి పవర్ పోగొట్టుకున్న కేసీఆర్
- కవిత కొత్త పార్టీకి సైతం 'తెలంగాణే' సెంటిమెంట్
- జార్ఖండ్ కోసమే పుట్టినా.. పేరు మార్చుకోని జేఎంఎం

**తెలంగాణ..**

ఒక అస్తిత్వం, ఒక ఆకాంక్ష, ఒక ఆత్మగౌరవం. అంతేకాదు.. ఒక అనుబంధం, ఒక ఎమోషన్, ఒక సెంటిమెంట్. సరిగ్గా రాజకీయ పార్టీలకు ఇదే అస్త్రమైంది. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని పెట్టుకున్నాయి. నాడు మర్రి చెన్నారెడ్డి పెట్టిన తెలంగాణ ప్రజా సమితి మొదలు.. తెలంగాణ సాధన సమితి, తెలంగాణ పార్టీ, జై తెలంగాణ పార్టీ, తెలంగాణ రాష్ట్ర సమితి, తల్లి తెలంగాణ, నవ తెలంగాణ ప్రజా పార్టీ, తెలంగాణ నగారా సమితి, తెలంగాణ ఇంటి పార్టీ, యువ తెలంగాణ పార్టీ, తెలంగాణ జన సమితి, వైఎస్సార్ తెలంగాణ పార్టీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ .. వీటన్నింటికీ ఆ పదమే ఆత్మగా మారింది. కాలక్రమంలో కొన్ని వేరే పార్టీల్లో విలీనమయ్యాయి. మరికొన్ని అంతర్ధానమయ్యాయి. ఆ పేరుతో ఇప్పుడు మిగిలింది టీజేఎస్, టీఆర్‌పీ మాత్రమే!

తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే పుట్టిన టీఆర్ఎస్ 'తెలంగాణ'ను తొలగించి 'భారత్' పెట్టుకున్నది. టీఆర్ఎస్ పేరు బీఆర్ఎస్ అయింది. 'ఓడ దాటే దాకా..' చందంగా కేసీఆర్ తన అవసరం తీరాక 'తెలంగాణ ఆత్మ'నే వదిలేశారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. పార్టీ పేరు మార్చుకున్న ఏడాదిన్నరకే కేసీఆర్ అధికారం కోల్పోయారు. అదే.. జార్ఖండ్ రాష్ట్ర సాధన కోసమే పుట్టిన జార్ఖండ్ ముక్తి మోర్చా పాతికేళ్లు దాటినా పార్టీ పేరును మాత్రం మార్చుకోలేదు. అక్కడ స్వరాష్ట్రంలో ఇప్పటికీ ఆ పార్టీ అధికారంలో ఉంది. ఇప్పుడు కల్వకుంట్ల కవిత పెట్టుకునే కొత్త పార్టీకి కూడా 'తెలంగాణ' పదమే దిక్కయింది. ఆమెకు తండ్రి ఆదర్శమవుతారా?.. లేక జేఎంఎం స్ఫూర్తిగా ఉంటుందా?.. కాలమే తేలుస్తుంది. 'తెలంగాణ' పార్టీలపై

*కలం 360 డిగ్రీస్ స్పెషల్...*

తెలంగాణ బ్యూరో, కలం

## మారిన టీఆర్ఎస్

తెలంగాణ మలి దశ ఉద్యమంలో పుట్టుకొచ్చిన పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్). దీన్ని 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ స్థాపించారు. ఆనాడు టీడీపీ నుంచి బయటకు వచ్చిన ఆయన.. దీన్ని స్థాపించారు. ప్రజల పోరాటం, అమరుల త్యాగాల ఫలితంగా 2014లో తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది.

- తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014, 2018లో వరుసగా రెండుసార్లు కేసీఆర్ అధికారంలోకి వచ్చారు.
- టీఆర్ఎస్‌ను జాతీయ స్థాయి పార్టీగా విస్తరించాలని 2022 అక్టోబర్ 5న కేసీఆర్ నిర్ణయం.
- టీఆర్ఎస్ నుంచి 'తెలంగాణ' పదం తొలగింపు. 2022 డిసెంబర్ 9న భారత రాష్ట్ర సమితిగా పేరు మార్పు.
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన బీఆర్ఎస్. ప్రతిపక్షానికి కేసీఆర్ పరిమితం.

## మారని జేఎంఎం




తెలంగాణ కోసం పుట్టిన ఉద్యమ పార్టీల్లాగే.. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోనూ స్వరాష్ట్ర సాధన కోసం కొన్ని పార్టీలు పుట్టుకొచ్చాయి. వాటిల్లో జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం పుట్టిన జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఇప్పటికీ అదే పేరుతో కొనసాగుతున్నది ఆ రాష్ట్రంలో అధికారంలోనూ ఉంది. బిహార్ నుంచి జార్ఖండ్‌ను విడదీసి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో జేఎంఎం పార్టీని 1972లో శిబూ సోరెన్ స్థాపించారు. దశాబ్దాల పోరాటం తర్వాత 2000 సంవత్సరంలో జార్ఖండ్ రాష్ట్రం ఏర్పడింది. ప్రస్తుతం అక్కడ జేఎంఎం అధికారంలో ఉంది. శిబు సోరెన్ కుమారుడు హేమంత్ సోరెన్ సీఎంగా కొనసాగుతున్నారు.

### పవర్ రాకపోయినా పేరు మారని పార్టీ

*ఉత్తరప్రదేశ్ నుంచి కొండ ప్రాంతాలను విడదీసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఉత్తరాఖండ్ క్రాంతి దళ్ పార్టీ ఏర్పాటైంది. దీన్ని 1979లో ఇంద్రమణి బడోని తదితరులు ఏర్పాటు చేశారు. దశాబ్దాల పోరాటం తర్వాత 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్ (గతంలో ఉత్తరాంచల్) ఏర్పాటైంది. అయితే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉత్తరాఖండ్ క్రాంతి దళ్ పార్టీ ప్రాముఖ్యం తగ్గిపోయింది. అది ఇప్పటి వరకు అధికారంలోకి రాలేదు. కానీ.. మనుగడలో మాత్రం ఉన్నది.*

UKD
उत्तराखंड क्रांति दल






ఎన్నో వచ్చినా మిగిలినవి రెండే..! 2వ పేజీలో

కలం
ప్రజల గళం...
21-02-2026, శనివారం
360° SINGLE TOPIC

# తెలంగాణ.. పార్టీలు





## తెలంగాణ పేరుతో కొత్తగా కవిత పార్టీ

మేలో కొత్త రాజకీయ పార్టీ పెట్టనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. తన పార్టీ పేరులో తప్పకుండా 'తెలంగాణ' అనే పదం ఉంటుందని చెప్పారు. ఉద్యమ పార్టీగా అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరలేదని గత కొన్ని రోజులుగా కవిత విమర్శలు చేస్తున్నారు. ఏకంగా పార్టీ నుంచి 'తెలంగాణ' పదాన్ని తీసేశారని తన తండ్రి కేసీఆర్ పై నిప్పులు చెరుగుతున్నారు.

## జై తెలంగాణ పార్టీ



చంద్రబాబు నాయుడు చేతుల్లోకి టీడీపీ వెళ్లాక విభేదాలతో పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఆ పార్టీ నుంచి బయటకొచ్చారు. 1998లో జై తెలంగాణ పార్టీని స్థాపించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా కొట్లాడారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, సీట్లేమీ రాలేదు. చివరకు 2000 సంవత్సరంలో ఇంద్రారెడ్డి మరణించిన తర్వాత ఆ పార్టీ కనిపించకుండా పోయింది.



## తెలంగాణ ప్రజా ఫ్రంట్

ప్రజా గాయకుడు గద్దర్ 2010లో తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) పేరుతో ఒక వేదికను ఏర్పాటు చేశారు. ఇది రాజకీయ పార్టీ కాకపోయినప్పటికీ.. ఈ వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ కోసం కొట్లాడారు. అయితే 2012లో దీని నుంచి గద్దర్ బయటకొచ్చారు. 2023లో తాను చనిపోవడానికి ముందు 'గద్దర్ ప్రజా పార్టీ' రిజిస్ట్రేషన్ కోసం ఎన్నికల సంఘానికి గద్దర్ దరఖాస్తు చేసుకున్నారు. ఆ ప్రక్రియ పూర్తి కాకముందే ఆయన కన్నుమూశారు.



## తెలంగాణ సాధన సమితి

తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి, పలుమార్లు జైలుకెళ్లిన ఆలె నరేంద్ర.. తెలంగాణ సాధన సమితి (టీఎస్ఎస్) పార్టీని స్థాపించారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో బీజేపీ వైఖరిని నిరసిస్తూ 2001లో ఆ పార్టీకి రాజీనామా చేసి.. అదే ఏడాది టీఎస్ఎస్ ఏర్పాటు చేశారు. అప్పుడు మెదక్ ఎంపీగా ఉన్నారు. అనంతర కాలంలో 2002 ఆగస్టు 11న టీఎస్ఎస్‌ను టీఆర్ఎస్‌లో విలీనం చేశారు.



## తల్లి తెలంగాణ

ప్రత్యేక తెలంగాణ విషయంలో బీజేపీ వైఖరి నచ్చక ఆ పార్టీలో నుంచి విజయశాంతి బయటకొచ్చారు. స్వరాష్ట్రమే లక్ష్యంగా 2005 జనవరిలో 'తల్లి తెలంగాణ' పార్టీని స్థాపించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని మొట్టమొదట ఆలోచన చేసి, భువనగిరిలో ఆవిష్కరించారు. దాదాపు నాలుగేండ్ల పాటు తెలంగాణ కోసం పోరాడి, ఉద్యమ శక్తులన్నీ ఏకం కావాలనే ఉద్దేశంతో 2009 జనవరిలో తన పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్సీగా విజయశాంతి కొనసాగుతున్నారు.



## తెలంగాణ ఇంటి పార్టీ

తెలంగాణ మలి దశ ఉద్యమంలో చెరుకు సుధాకర్ కీలక పాత్ర పోషించారు. స్వరాష్ట్రం వచ్చినా అమరుల ఆశయాలు నెరవేరలేదని, నిరుద్యోగుల బతుకులు బాగుపడలేదని.. కేసీఆర్ సర్కార్‌పై అసంతృప్తితో 2017 జూన్ 2న 'తెలంగాణ ఇంటి పార్టీ'ని స్థాపించారు. దాదాపు ఐదేండ్లు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. చివరికి 2022లో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారు.

## తెలంగాణ పార్టీ

1984లో జె.దేవానంద స్వామి వరంగల్ వేదికగా తెలంగాణ పార్టీని స్థాపించారు. ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో ఎక్కువగా యాక్టివ్‌గా ఉండేది. కానీ రాజకీయంగా పెద్దగా ఎదగలేకపోయింది. కాలక్రమేణా కనుమరుగైంది.



## వైఎస్సార్‌టీపీ

తెలంగాణలో మళ్లీ 'రాజన్న రాజ్యం' తీసుకొస్తానంటూ వైఎస్ షర్మిల 2021 జులై 8న వైఎస్సార్ తెలంగాణ పార్టీని స్థాపించారు. ప్రజా ప్రస్థానం పేరుతో పాదయాత్ర చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారని భావించినప్పటికీ.. చివరికి కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేశారు. షర్మిల ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్నారు.

## యువ తెలంగాణ పార్టీ



తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి. ఆయన మొదట టీఆర్ఎస్‌లో ఉండేవారు. 2009లో ఆ పార్టీ నుంచి బయటకొచ్చి.. కాంగ్రెస్, వైసీపీలో కొన్నాళ్లు కొనసాగారు. 2018లో యువ తెలంగాణ పార్టీ పెట్టి, భువనగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2022లో తన పార్టీని బీజేపీలో విలీనం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు మళ్లీ బీఆర్ఎస్‌లో చేరారు. అనారోగ్యంతో ఆయన 2024లో చనిపోయారు.

## నవ తెలంగాణ ప్రజా పార్టీ

టీడీపీలో కీలక నేతగా ఉన్న టైమ్ లో టి.దేవేందర్ గౌడ్.. ఆ పార్టీకి రాజీనామా చేసి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా నవ తెలంగాణ ప్రజా పార్టీని స్థాపించారు. దీన్ని 2008 జులై 11న ప్రారంభించారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలోని అన్ని సీట్లలో పోటీ చేయాలని మొదట భావించారు. కానీ అదే ఏడాది ఫిబ్రవరి 26న ప్రజారాజ్యం పార్టీ (పీఆర్పీ)లో తన పార్టీని విలీనం చేశారు. దేవేందర్ గౌడ్ 2009 ఆగస్టులో పీఆర్పీకి రాజీనామా చేసి, మళ్లీ టీడీపీలో చేరారు. ప్రస్తుతం ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు.




## తెలంగాణ రాష్ట్ర పార్టీ

టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన గాదె ఇన్నయ్య.. ఆ పార్టీలో విభేదాల కారణంగా బయటకొచ్చారు. 2002 అక్టోబర్ 11న తెలంగాణ రాష్ట్ర పార్టీ (టీఆర్‌పీ)ని స్థాపించారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, ఒక్క సీటూ గెలవలేకపోయారు. ఆ తర్వాత క్రమంగా పార్టీ కనుమరుగైపోయింది.



## తెలంగాణ నగారా సమితి

2011 మేలో టీడీపీ నుంచి నాగం జనార్దన్ రెడ్డి సస్పెండ్ అయ్యారు. అదే ఏడాది ఆయన తెలంగాణ నగారా సమితి పేరుతో కొత్త పార్టీ పెట్టారు. కానీ, ఈ పార్టీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2013లో బీజేపీలో విలీనం చేశారు.





## మళ్లీ 'తెలంగాణ ప్రజా సమితి'

'తెలంగాణ గాంధీ'గా పేరొందిన భూపతి కృష్ణమూర్తి 1990 ఫిబ్రవరి 17న తెలంగాణ ప్రజా సమితి పార్టీని పునరుద్ధరించారు. తెలంగాణ పోరాటాన్ని కొనసాగించి, మలి దశ ఉద్యమానికి పునాది వేశారు. 2015లో మరణించారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన తీన్మార్ మల్లన్న.. 2025 సెప్టెంబర్ 17న తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ)ని స్థాపించారు. బీసీలకు రాజ్యాధికారం దక్కాలన్న నినాదంతో ముందుకు వెళ్తున్నారు.



## తెలంగాణ జన సమితి

తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం జేఏసీ చైర్మన్‌గా కొనసాగారు. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని కేసీఆర్ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 2018 మార్చి 31న తెలంగాణ జన సమితి (టీజేఎస్) పేరుతో కొత్త పార్టీ పెట్టారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యమని చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐతో కలిసి 'ప్రజా కూటమి'లో భాగంగా టీజేఎస్ పోటీ చేయగా.. ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఆ తర్వాత పోటీ చేసిన ఎన్నికల్లోనూ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల టైమ్ లో బరిలో నుంచి తప్పుకుని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది.

